## విదేశీ డిగ్రీల గుర్తింపుపై కొత్త నిబంధనలు

### దరఖాస్తుల కోసం త్వరలో యూజీసీ కొత్త పోర్టల్

ముంబై: విదేశీ విద్యార్థులకు సంబంధించిన డిగ్రీలను ఆమోదించే విధానాన్ని క్రమబద్ధీకరిస్తూ యూజీసీ కొత్త నిబంధనలను తీసుకువచ్చింది. విదేశాలలో పొందిన డిగ్రీలు, స్కూల్ సర్టిఫికెట్లను తనిఖీ చేసి గుర్తింపు ఇచ్చేందుకు ఆన్‌లైన్ పోర్టల్‌ను యూజీసీ ప్రవేశపెట్టనున్నది. ప్రపంచవ్యాప్తంగా భారత్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చే దృక్పథంతో జాతీయ విద్యా విధానం(ఎన్ఈపీ)లో భాగంగా విదేశీ డిగ్రీల గుర్తింపు ప్రక్రియను సులభతరం చేయడమే ఈ కొత్త నిబంధన ఉద్దేశమని యూజీసీ చైర్మన్ జగదీశ్ కుమార్ చెప్పారు. అంతర్జాతీయ డిగ్రీలు లేదా స్కూలు విద్యార్హతలతో చాలా మంది విద్యార్థులు భారత్‌కు తిరిగివస్తారని, అయితే వాటికి గుర్తింపు పొందడంలో తీవ్ర జాప్యాలు, అవరోధాలు ఎదుర్కొంటారని ఆయన చెప్పారు. ఈ కొత్త నిబంధన స్పష్టతను, కచ్చితమైన అంచనాను, నిష్పాక్షికతను అందచేయగలదని ఆయన వివరించారు. విదేశీ విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఓ ఆన్‌లైన్ పోర్టల్‌ను యూజీసీ ప్రారంభించనున్నది. విద్యా సంబంధ నిపుణులతో కూడిన స్టాండింగ్ కమిటీ ఈ దరఖాస్తులను సమీక్షించి 15 పని దినాలలో తన నిర్ణయాన్ని తెలియచేస్తుంది. గుర్తింపు ఇచ్చేందుకు ప్రోగ్రామ్ కాల నిడివి, క్రెడిట్ హవర్స్, వాల్యుయేషన్ ప్రాసెస్, అకడమిక్ రికార్డులను కమిటీ పరిగణనలోకి తీసుకుంటుంది.



## దేశంలో సగటు 7.5 పని గంటలు

- ఢిల్లీలో అత్యధికంగా 9.5 గంటలు
- కేంద్ర ప్రభుత్వ తాజా నివేదిక వెల్లడి

**వివిధ రాష్ట్రాల్లో ఉద్యోగుల పని గంటలు**

| | |
|---|---|
| ఢిల్లీ - | 9.5 |
| హర్యానా - | 8.2 |
| తమిళనాడు - | 8 |
| ఒడిశా, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ - | 7 |

న్యూఢిల్లీ: భారత్‌లో ఎక్కడా లేని విధంగా ఢిల్లీలో ప్రజలు అత్యధిక సమయాన్ని తమ ఉద్యోగ కార్యకలాపాల కోసం వెచ్చిస్తున్నట్టు ఓ తాజా అధ్యయనంలో వెల్లడైంది. భారత్‌లో సగటున ఉద్యోగి రోజుకు 455 నిమిషాలు అంటే 7.5 గంటలు ఉద్యోగ నిర్వహణలో గడుపుతుండగా ఢిల్లీలో మాత్రం రోజుకు 571 నిమిషాలు లేదా 9.5 గంటలు పనిచేస్తున్నట్టు కేంద్ర గణాంకాలు, కార్యక్రమ అమలు శాఖ విడుదల చేసిన తాజా నివేదిక వెల్లడించింది. ఈ పని గంటలలో ఇంటి నుంచి కార్యాలయానికి వెళ్లి తిరిగి రావడానికి ఖర్చవుతున్న సమయాన్ని కూడా కలిపినట్టు టైమ్ యూజ్ సర్వే నివేదిక పేర్కొంది.

- యూపీలో పురుష ఉద్యోగులతో పోలిస్తే మహిళలు 72 శాతం తక్కువ సమయం పని చేస్తున్నారు. బీహార్‌లో ఇది 71.6 శాతంగా ఉంది.
- ఢిల్లీ, కేరళలో ఈ తేడా కేవలం 22 శాతం, గోవాలో ఈ తేడా కేవలం 8%.
- గ్రామాల్లో 15-59 సంవత్సరాల వయస్కులు రోజుకు ఉపాధి కోసం వెచ్చిస్తున్న సమయం - సుమారు 424 నిమిషాలు.
- పట్టణాల్లో 15-59 సంవత్సరాల వయస్కులు ఉపాధి కోసం రోజులో వెచ్చిస్తున్న సమయం- 494 నిమిషాలు

# ఆర్థిక మాంద్యం తప్పదా?

- అమెరికా సహా ప్రపంచమంతటా వచ్చేందుకు 60% అవకాశం ఉందని జేపీ మోర్గాన్ అంచనా
- పలు ఇతర ప్రముఖ ఆర్థిక వ్యవహారాల సంస్థలదీ అదే మాట
- లక్షలాది మంది ఐటీ, టెక్ ఉద్యోగాలు ఊడే ప్రమాదం



న్యూయార్క్, ఏప్రిల్ 5: ప్రపంచ దేశాలపై ట్రంప్ విధించిన ప్రతీకార సుంకాలు వాణిజ్య యుద్ధానికి దారి తీస్తుందన్న భయం ఇప్పుడు అమెరికా సహా ప్రపంచమంతటా నెలకొంది. ముఖ్యంగా ట్రంప్ టారిఫ్‌లకు ప్రతీకారంగా చైనా ప్రతీకార సుంకాలు విధిస్తామని ప్రకటించడం, మరికొన్ని దేశాలు సైతం అదే తరహా వైఖరిని వ్యక్తం చేస్తున్న క్రమంలో అమెరికా సహా ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం వచ్చే అవకాశం 60 శాతం ఉందని ప్రపంచ ప్రసిద్ధ అమెరికన్ ఆర్థిక సేవల సంస్థ జేపీ మోర్గాన్ హెచ్చరించింది. ఇదే కనుక జరిగితే అమెరికాలో లక్షలాది మంది ఉద్యోగాలు పోయే అవకాశం ఉంది. దీని ప్రభావం ప్రపంచమంతటా తీవ్రంగా పడుతుంది. ట్రంప్ నిర్ణయంతో ఇప్పటికే కొన్ని దేశాలు కుదేలయ్యే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. ట్రంప్ సుంకాల విధింపు తర్వాత ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఈ ఏడాది చివరి నాటికి ఆర్థిక మాంద్యంలోకి ప్రవేశించే అవకాశం 60 శాతానికి చేరుకుందని, అంతకు ముందు ఇది 40 శాతమే ఉందని జేపీ మోర్గాన్ విశ్లేషించింది. విధ్వంసకర అమెరికా విధానాలు ఈ ఏడాదంతా ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ప్రమాదంలో పెట్టే అవకాశాలు ఉన్నట్టు గుర్తించామని పేర్కొంది. ఆ దేశ వాణిజ్య విధానం తక్కువ వ్యాపార అనుకూలంగా ఉందని గురువారం వెల్లడించింది.

**ఆర్థిక మూలాలు పటిష్ఠంగా లేవు**

బ్యాంకులు, పెట్టుబడి, ఇతర ఆర్థిక వ్యవహారాల గురించి విశ్లేషించే ఎస్ అండ్ పీ గ్లోబల్ సంస్థ కూడా అమెరికాలో ఆర్థిక మాంద్యం సంభవించే అవకాశం 30 నుంచి 35 శాతం ఉందని పేర్కొంది. మార్చి నాటికి ఇది 25 శాతం ఉందని తెలిపింది. ట్రంప్ టారిఫ్‌లు ప్రకటించక ముందు గోల్డ్‌మన్ శాచ్స్ కూడా అమెరికాలో ఆర్థిక మాంద్య ప్రమాదం గతంలో 20 శాతం ఉండగా, అది ఇప్పుడు 35 శాతానికి పెరిగిందని ప్రకటించింది. ఈ ఆర్థిక మాంద్యం వాస్తవ రూపం ఇప్పటికే ఈక్విటీ మార్కెట్‌లో ప్రతిబింబించిందని హెచ్‌ఎస్‌బీసీ తెలిపింది. ప్రముఖ ఆర్థిక, బ్రోకరేజ్, బ్యాంకింగ్ సంస్థలైన బార్క్లేస్, బోఫా గ్లోబల్ రీసెర్చ్, డ్యూయిష్ బ్యాంక్, ఆర్‌బీసీ కేపిటల్ మార్కెట్స్, యూబీఎస్ గ్లోబల్ వెల్త్ మేనేజ్‌మెంట్‌లు సైతం ఈ ఏడాది అమెరికా రెసిషన్ ముప్పును ఎదుర్కొనే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని హెచ్చరిస్తున్నాయి.

**ట్రేడ్ వార్‌కు తగ్గేదేలే: ట్రంప్**

ఆర్థికం మాంద్యం అంచనాలు వస్తున్నా ప్రపంచ వాణిజ్య యుద్ధాన్ని ప్రారంభించడానికి వెనుకాడేది లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. అమెరికాతో వ్యాపారం చేసే భాగస్వాములపై ట్యారిఫ్‌ల విధింపు నిర్ణయంలో మార్పు లేదని తెలిపారు. అమెరికాలో పెట్టుబడులు పెడుతున్న వారిని ఉద్దేశించి ఇచ్చిన పోస్ట్‌లో, తన విధానాలు ఎన్నడూ మారబోవని తెలిపారు. సంపన్నులమవడానికి, మునుపెన్నడూ లేనంతగా సంపన్నులమవడానికి ఇది చాలా గొప్ప సమయమని సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్‌లో పోస్ట్‌ను పెట్టారు. తయారీ రంగంలో అమెరికా కోల్పోయిన ఉద్యోగాలు తిరిగి అమెరికాకు వస్తాయని ఫెడరల్ ప్రభుత్వానికి లక్షల కోట్ల డాలర్లు సమకూరుతాయని తెలిపారు. ఆర్థిక మాంద్యం అంచనాల నేపథ్యంలో అమెరికన్ బ్యాంకింగ్ రంగం షేర్స్ శుక్రవారం దాదాపు 6 శాతం పతనమయ్యాయి.అమెరికా ఫెడరల్ రిజర్వు సత్వరమే వడ్డీ రేట్లను తగ్గించాలని మదుపరులు ఆశిస్తున్నారు. అయితే ట్యారిఫ్‌ల వల్ల ధరలు పెరిగే అవకాశం ఉందని, ఆర్థిక అరాచకత్వం ప్రబలుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టలినా జార్జివ స్పందిస్తూ వృద్ధి మందకొడిగా ఉన్న సమయంలో ప్రపంచ దేశాలకు తీవ్రమైన ముప్పు ఉన్నట్లు కనిపిస్తున్నదని తెలిపారు.

**చైనాకు భయాందోళనలు**

వాల్ స్ట్రీట్ శుక్రవారం ప్రారంభం అవడానికి కాస్త ముందు ట్రంప్ ఇచ్చిన పోస్ట్‌లో, అమెరికా నుంచి దిగుమతులపై కొత్తగా ప్రతీకార ట్యారిఫ్‌లను చైనా ప్రకటించిందన్నారు. దీని నిబట్టి చైనా భయాందోళనలకు గురైనట్లు స్పష్టమవుతున్నదని ఎద్దేవా చేశారు. ఇది భయాందోళనలకు గురి కాదగిన సమయం కాదని చెప్పారు.

**ధరల భయంతో స్టోర్ల ముందు క్యూ**

ట్రంప్ వివిధ దేశాల నుంచి వచ్చే దిగుమతులపై సుంకాలు ప్రకటించడంతో నిత్యావసరాలు, పలు ఇతర వస్తువుల ధరలు కొండెక్కనున్నాయి. దీంతో ధరల ప్రభావం నుంచి తప్పించుకునేందుకు అమెరికా పౌరులు భారీ యెత్తున స్టోర్లు, మార్కెట్లపైకి ఎగబడుతున్నారు. ఇతర దేశాలు విధించిన టారిఫ్‌ల కారణంగా అమెరికాలో అనేక వస్తులవుల ధరలు మరింత పెరుగనున్నాయి. తైవాన్‌పై ట్రంప్ 32 శాతం సుంకాలు విధించడంతో ఆ దేశం నుంచి వచ్చే ఎలక్ట్రానిక్ వస్తువులు, ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు తదితర ధరలు పెరగనున్నాయి. ఇక ఇతర దేశాల నుంచి వచ్చే వస్తువుల ధరలూ పెరగనున్నాయి. దీంతో పండ్ల దగ్గర నుంచి టూత్‌పేస్ట్ వరకు, సెల్‌ఫోన్ నుంచి ఇయర్ ఫోన్ వరకు, పలు వస్తువుల ధరలు పెరగకముందే కొనుగోలు చేసేందుకు అమెరికన్లు క్యూలు కడుతున్నారు. ట్రంప్ టారిఫ్‌ల కారణంగా పండ్లు, కూరగాయలు, పాల ఉత్పత్తుల ధరలు ముందుగా పెరుగుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే ఈ ప్రభావం ఉత్పత్తి రంగంలో అంతగా ఉండదు. ముఖ్యంగా వస్త్రాలు, పాదరక్షలు, ఆటో విడిభాగాలు, ఔషధ రంగ ఉత్పత్తులు ఎక్కువగా అమెరికా దిగుమతి చేసుకుంటున్నది. వీటి ధరలు పెరిగినా అమ్మకాలు యధావిధిగానే కొనసాగవచ్చునని అంచనా వేస్తున్నారు. ఈ సందర్భంగా నిపుణులు పౌరులకు పలు సూచనలు చేస్తున్నారు. ధరలు చూసి బెంబేలెత్తిపోవద్దని, అవసరమైన దానికన్నా ఎక్కువ సరుకును కొనుగోలు చేయవద్దని, వాటిని నిల్వ చేయవద్దని సూచిస్తున్నారు. కాగా, అమెరికా అన్ని విదేశీ దిగుమతులపై 10 శాతం పన్నులు విధించగా, శనివారం నుంచి అవి అమలులోకి వస్తాయని ప్రకటించింది. అధిక డ్యూటీలు విధించిన పన్నులు మాత్రం ఏప్రిల్ 9 నుంచి అమలవుతాయి.

### భారత ఐటీ కంపెనీలపైనా మాంద్యం ఎఫెక్ట్!




ట్రంప్ నేతృత్వంలోని అమెరికా ప్రభుత్వం ప్రకటించిన టారిఫ్‌ల సెగ భారతీయ ఐటీ కంపెనీలకు కూడా తగులుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ టారిఫ్‌ల వల్ల అమెరికాలో ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉందని, ఫలితంగా క్లయింట్లు ఖర్చులను తగ్గించుకుంటారని చెప్తున్నారు. ఐటీ సేవలపై ట్రంప్ ప్రత్యక్షంగా టారిఫ్‌లను విధించలేదు. అయినప్పటికీ, అమెరికాలోని మాన్యుఫ్యాక్చరింగ్, లాజిస్టిక్స్, రిటెయిల్ రంగాలకు చెందిన క్లయింట్లు కొత్త సుంకాలకు తగినట్లుగా తమ బడ్జెట్లను సర్దుబాటు చేసుకుంటారు. భారతీయ ఐటీ కంపెనీలకు ప్రధాన మార్కెట్ అమెరికన్ కంపెనీలే కాబట్టి ఇబ్బందులు తప్పవని విశ్లేషకులు చెప్తున్నారు. ట్రంప్ టారిఫ్‌లను ప్రకటించిన వెంటనే భారతీయ ఐటీ రంగం రేటింగ్స్‌ను బెర్న్‌స్టీన్, ఐసీఐసీఐ సెక్యూరిటీస్ తగ్గించాయి. అనేక సంవత్సరాల నుంచి ఆదాయ వృద్ధి బలహీనంగా ఉన్న నేపథ్యంలో క్లయింట్ కాన్ఫిడెన్స్‌ను ట్రంప్ పునరుద్ధరిస్తారని ఐటీ రంగం ఆశలు పెట్టుకుంది. అటువంటి సమయంలో టారిఫ్‌ల పిడుగులు కురిశాయి. భారత దేశం నుంచి సాఫ్ట్‌వేర్ ఎగుమతుల విలువ 190 బిలియన్ డాలర్లు. దీనిలో సగానికిపైగా అమెరికాకు ఎగుమతి అవుతున్నది. ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలో వ్యాపార సంస్థలకు తమ వ్యయాలపై విశ్వాసం సన్నగిల్లితే, ఆ మార్పుల ప్రభావం భారతీయ ఐటీ కంపెనీలపై కచ్చితంగా పడుతుంది. ఆర్థిక మాంద్య ప్రమాదమున్న క్రమంలో అనవసరమైన వాటిపై ఖర్చు చేసే కంపెనీలు ఇబ్బందులు పడక తప్పదని బీఎన్‌పీ పారిబాస్ విశ్లేషకుడు కుమార్ రాకేశ్ చెప్పారు.



### అయోధ్య రాముడికి నేడు సూర్య తిలకం

అయోధ్య: అయోధ్యలోని శ్రీరామ జన్మభూమిలో నిర్మించిన దివ్యమైన రామాలయం శ్రీరామ నవమి ఉత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు బాల రాముని నుదుటిపై సూర్య కిరణాలతో తిలకం దిద్దనున్నారు. ఈ అద్భుత ఘట్టం దాదాపు నాలుగు నిమిషాలపాటు కొనసాగుతుంది. దీనిని భక్తులు తిలకించేందుకు ఏర్పాట్లు చేసినట్లు శ్రీరామ జన్మభూమి ట్రస్ట్ తెలిపింది. శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా బాల రామునికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించనున్నారు.

### హైకోర్టు జడ్జిగా జస్టిస్ యశ్వంత్ ప్రమాణం

**న్యాయ విధులకు దూరం**

న్యూఢిల్లీ: అక్రమ నగదు వ్యవహారానికి సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్న జస్టిస్ యశ్వంత్ వర్మ అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. శనివారం ఎలాంటి హడావిడి లేకుండా ఒక సాధారణ ప్రైవేట్ చాంబర్‌లో ఆయన ప్రమాణ స్వీకారాన్ని ముగించినట్టు అధికారులు తెలిపారు. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిగా యశ్వంత్ వర్మకు ప్రస్తుతానికి ఎలాంటి న్యాయపరమైన విధులనూ సుప్రీంకోర్టు కేటాయించలేదు. జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయడాన్ని వ్యతిరేకిస్తూ అలహాబాద్ బార్ అసోసియేషన్ నిరవధిక సమ్మెను ప్రకటించగా, సుప్రీంకోర్టు సీజేఐ సంజీవ్ ఖన్నా ఇచ్చిన హామీతో అసోయేషన్ తమ సమ్మె ఆలోచనను విరమించుకుంది.

### జెలెన్‌స్కీ సొంతూరిపై రష్యా దాడి

**18 మంది మృతి**

కీవ్: ఒక పక్క యుద్ధం ఆపడానికి ప్రయత్నాలు కొనసాగుతుండగా, ఉక్రెయిన్‌పై రష్యా మరోసారి దాడికి దిగింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సొంత నగరమైన క్రైవీ రీపై శుక్రవారం రష్యా జరిపిన క్షిపణి దాడుల్లో 18 మంది మరణించగా 61 మంది గాయపడ్డారు. మృతులలో 9 మంది పిల్లలు ఉన్నారని రీజినల్ గవర్నర్ సెర్హిల్ లైసాక్ శనివారం తెలిపారు. నివాస భవనాలకు పక్కన పిల్లల ఆటస్థలం ఉన్న ప్రాంతాన్ని క్షిపణి తాకిందని జెలెన్‌స్కీ టెలిగ్రామ్‌లో తెలిపారు. ఆ దాడిలో 20కి పైగా అపార్టుమెంట్ భవనాలు దెబ్బతినగా, 30కి పైగా వాహనాలతో పాటు ఒక విద్యా భవనం, రెస్టారెంట్ కూడా ధ్వంసమయ్యాయని అధికారులు వివరించారు. దాడులు కొనసాగించడం చూస్తుంటే యుద్ధాన్ని విరమించడం రష్యాకు ఇష్టం లేనట్టు కన్పిస్తున్నదని జెలెన్‌స్కీ విమర్శించారు.

### కెనడాలో భారతీయుడి హత్య

**ఓ అనుమానితుడి అరెస్ట్**

న్యూఢిల్లీ: కెనడాలోని ఒట్టావా సమీపంలో ఓ భారతీయుడు దారుణ హత్యకు గురయ్యారు. ఆయనను ఓ వ్యక్తి రాక్‌లాండ్ ప్రాంతంలో కత్తితో పొడిచి, హత్య చేశాడు. ఈ ఘటనకు సంబంధించి ఓ అనుమానితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితుని కుటుంబానికి స్థానిక సంఘం సహకారంతో సహాయపడుతున్నట్టు ఇండియన్ ఎంబసీ తెలిపింది. ఈ ప్రాంతంలో భద్రత పెంచినట్టు ఒంటారియో ప్రావిన్షియల్ పోలీసులు తెలిపారు.

### 2034 తర్వాతే జమిలి ఎన్నికలు


**నిర్మలా సీతారామన్ స్పష్టీకరణ**

చెన్నై, ఏప్రిల్ 5: ఒక దేశం, ఒకే ఎన్నికల ప్రతిపాదనపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం తోసిపుచ్చారు. రానున్న 2029 ఎన్నికలలో ఇది అమలు కాదని, 2034 ఎన్నికల తర్వాతే ఇది అమలులోకి వస్తుందని ఆమె స్పష్టం చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల కోసం దాదాపు రూ. లక్ష కోట్లు ఖర్చయ్యిందని, జమిలి ఎన్నికల ద్వారా ఇంత భారీ మొత్తం ఆదా అవుతుందని ఆమె తెలిపారు. పార్లమెంట్, అసెంబ్లీల సభ్యులకు ఒకేసారి ఎన్నికలు జరపడం వల్ల దేశ జీడీపీకి 1.5 శాతం ప్రగతి జత కూడుతుందని ఆమె అన్నారు.

### ఎంపురాన్ నిర్మాత ఆస్తులపై ఈడీ దాడులు

**అక్రమ నిధులతో సినిమా తీశారని అనుమానాలు**

తిరువనంతపురం, ఏప్రిల్ 5: మలయాళ సినిమా 'ఎంపురాన్' నిర్మాత గోకులం గోపాలన్ కార్యాలయాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తాజాగా దాడులు చేపట్టింది. చెన్నై, కొచ్చి, కర్ణాటకలలో ఆయనకు సంబంధించిన ఐదు ప్రాంతాల్లో ఈడీ అధికారులు సోదాలు జరిపి కీలక పరికరాలు స్వాధీనం చేసుకున్నట్టు ఈడీ వర్గాలు తెలిపాయి. చెన్నైలో జరిపిన సోదాల్లో రూ.1.5 కోట్ల నగదును ఈడీ సీజ్ చేసినట్టు తెలిసింది. అక్రమ నగదు లావాదేవీలతో వచ్చిన నిధులను ఉపయోగించి 'ఎంపురాన్' సినిమా తీశారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. 'శ్రీ గోపాలన్ చిట్, ఫైనాన్స్' కంపెనీపై ఈడీ తాజాగా ఫెమా దాడులు నిర్వహించింది. 2017లో గోపాలన్‌కు చెందిన చిట్ ఫండ్ కంపెనీపై ఐటీ దాడులు జరిగాయి. 78 శాఖల్లో రూ.1,107 కోట్ల విదేశీ పెట్టుబడులు ఉన్నట్టు గుర్తించారు.



### 'సాగర్' జల ప్రవేశం

**హిందూ మహా సముద్ర భవిష్యత్తులో కీలక పాత్ర**

బెంగళూరు: రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శనివారం ఇండియన్ ఓషన్ షిప్ సాగర్‌ను ప్రారంభించారు. వ్యూహాత్మక ప్రాంతమైన కర్ణాటకలోని కర్వార్ నావికా దళ స్థావరంలో దీనిని ఆవిష్కరించారు. ఇక్కడ కొత్తగా అభివృద్ధిపరచిన మౌలిక సదుపాయాలను కూడా ఆయన ప్రారంభించారు. రక్షణ మంత్రి కార్యాలయం ఎక్స్ పోస్ట్‌లో తెలిపిన వివరాల ప్రకారం, హిందూ మహాసముద్ర ప్రాంతం భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఐఎన్ఎస్ సాగర్ కీలక పాత్ర పోషిస్తుంది. అన్ని ప్రాంతాల భద్రత కోసం పరస్పర, సంపూర్ణ అభివృద్ధి అనే భారత దేశ దార్శనికతకు అనుగుణంగా నౌకను నిర్మించినట్టు అధికారులు చెప్పారు.

## నకిలీ వైద్యుడి ఆపరేషన్లకు రోగులు బలి

- రేడియాలజిస్ట్ పేరుతో గుండె శస్త్ర చికిత్సలు
- మధ్యప్రదేశ్ దవాఖానలో ఏడుగురి మృత్యువాత




డబుల్ ఇంజిన్ ట్రబుల్

దామో, ఏప్రిల్ 5: బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లోని దామో నగరంలో దారుణం చోటు చేసుకుంది. ప్రైవేట్ మిషనరీ దవాఖానలో ఓ నకిలీ డాక్టర్ చేసిన గుండె ఆపరేషన్లు ఏడుగురిని బలిగొన్నాయి. ఒకే నెలలో ఏడుగురు మరణించడం ఆ ప్రాంతంలో అలజడి రేపింది. ఎన్ జాన్ కెమ్ పేరుతో ఓ బ్రిటిష్ డాక్టర్ ముసుగులో ఓ వ్యక్తి క్రైస్తవ మిషనరీ దవాఖానలో ఉద్యోగంలో చేరాడు. రేడియాలజిస్టునని చెప్పుకున్న ఆ నకిలీ డాక్టర్ రోగులకు గుండె ఆపరేషన్లు చేశాడు. ఆ డాక్టర్ చేతిలో శస్త్ర చికిత్సలు చేయించుకున్న రోగులు కొన్ని గంటల్లోనే మరణించినట్టు అధికారులు చెప్పారు. దీనిపై దర్యాప్తు మొదలుపెట్టిన అధికారులకు ఆ నకిలీ డాక్టర్ అసలు పేరు నరేంద్ర విక్రమాదిత్య యాదవ్ అని తెలిసింది. అధికారిక లెక్కల ప్రకారం మరణాలు ఏడుగా తేలినప్పటికీ లెక్కల్లో చూపనివి చాలానే ఉన్నట్టు జిల్లా శిశు సంక్షేమ కమిటీ అధ్యక్షుడు, న్యాయవాది దీపక్ తివారీ తెలిపారు. ఆ నకిలీ డాక్టర్‌పై దామో జిల్లా మెజిస్ట్రేట్‌కు ఆయన ఇదివరకే ఫిర్యాదు చేశారు. తమ తండ్రికి గుండె ఆపరేషన్ చేయించేందుకు తాము మిషనరీ దవాఖానకు తీసుకెళ్లామని, అయితే అక్కడి వాతావరణాన్ని చూసి అనుమానంతో జబల్‌పూర్‌కు తమ తండ్రిని తీసుకెళ్లామని కొందరు రోగుల పిల్లలు తనకు ఫిర్యాదు చేసినట్టు తివారీ చెప్పారు. అప్పుడే తమకు కూడా నకిలీ డాక్టర్ దవాఖానలో పని చేస్తున్నట్టు తెలిసిందని ఆయన చెప్పారు. అసలు డాక్టర్ బ్రిటన్‌లో ఉండగా నరేంద్ర యాదవ్ నకిలీ డాక్టర్‌గా చెలామణి అవుతున్నాడని ఆయన వెల్లడించారు. ఆ వ్యక్తిపై హైదరాబాద్‌లో కూడా కేసు నమోదైందని, అతను తన విద్యార్హతకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు చూపించడం లేదని తివారీ తెలిపారు. ఆయుష్మాన్ భారత్ పథకం కింద మిషనరీ దవాఖానకు ప్రభుత్వం నుంచి నిధులు అందుతున్నాయని మానవ హక్కుల కమిషన్ సభ్యుడు ప్రియాంక్ కనూన్‌గో తెలిపారు. మిషనరీ దవాఖానలో రోగులకు ఓ నకిలీ వైద్యుడు గుండె ఆపరేషన్లు చేసినట్టు తమకు ఫిర్యాదు అందిందని, ఇది చాలా తీవ్రమైన విషయమని ఆయన చెప్పారు.

## ఏఐతో 140 కోట్ల ఉద్యోగాలపై ప్రభావం

### యూఎన్ సంస్థ హెచ్చరిక



న్యూఢిల్లీ, ఏప్రిల్ 5: ప్రపంచ వ్యాప్తంగా సంచలనాలు సృష్టిస్తున్న కృత్రిమ మేధ (ఏఐ) మార్కెట్ విలువ 2033 నాటికి 4.8 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. ఇది ఇంచుమించు జర్మనీ ఆర్థిక వ్యవస్థ పరిమాణంతో సమానం. అయితే తాజాగా యూఎన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ (యూఎన్‌సీటీఏడీ) తెలిపిన వివరాల ప్రకారం ఏఐ కారణంగా ప్రపంచ వ్యాప్తంగా 140 కోట్ల (40 శాతం) ఉద్యోగాలపై తీవ్ర ప్రభావం పడనుంది. ఇది తక్కువ ఖర్చుతో కూడిన శ్రమపై ఆధారపడిన దేశాలను అసమానంగా ప్రభావితం చేస్తుంది. ఈ ఏఐ అభివృద్ధిని ప్రపంచమంతటా సమానంగా పంచుకోదు. ఈ అభివృద్ధి కొన్ని సంస్థలకో, లేదా అభివృద్ధి చెందిన దేశాల్లోనే కేంద్రీకృతం కావచ్చు. ప్రధానంగా అమెరికా, చైనాలు ఈ విషయంలో ముందుండి అసమానతలో మిగతా దేశాలకు హెచ్చరికగా నిలువవచ్చు. ప్రపంచ ఏఐ ఆర్ అండ్ డీ వ్యయంలో 40 శాతం కేవలం 100 సంస్థలు మాత్రమే ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. ఇది సాంకేతిక కేంద్రీకరణను చూపుతున్నది. ఆపిల్, మైక్రోసాఫ్ట్, ఎన్విడియా వంటి దిగ్గజాలు ఇప్పటికే ఆఫ్రికన్ ఖండ జీడీపీకి పోటీగా మార్కెట్ మూల ధనీకరణను కలిగి ఉన్నాయి. ఏఐ ఆధారిత ఆటోమేషన్ శ్రమ కంటే మూల ధనానికి అనుకూలంగా ఉంటుంది. ఇది అభివృద్ధి చెందుతున్న దేశాల పోటీతత్వాన్ని తగ్గిస్తుంది. అంతేకాకుండా ఆదాయ అసమానతలను పెంచుతుందని ఆ నివేదిక హెచ్చరించింది.

### ఆటవిక చట్టాల కన్నా ప్రమాదం

**వక్ఫ్(సవరణ) బిల్లుపై ఉలేమా బోర్డు**

ముంబై, న్యూఢిల్లీ, ఏప్రిల్ 5: ఒకప్పటి నల్ల చట్టాలు లేదా ఆటవిక చట్టాల కన్నా వక్ఫ్ బిల్లు అత్యంత ప్రమాదకారి అని ఆల్ ఇండియా ఉలేమా బోర్డు అభివర్ణించింది. మసీదులు, మదర్సాలు వంటి ఇస్లామిక్ ఆస్తులకు ఇది ప్రమాదకరమని బోర్డు జాతీయ అధ్యక్షుడు అల్లామా బనీ నయీమ్ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ముంబై ప్రెస్ క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ బిల్లు పాసైతే మసీదులు, మదర్సాలు, షెల్టర్ హోంలు వంటి వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

**బిల్లుకు రాష్ట్రపతి ఆమోద ముద్ర**

వివాదాస్పద వక్ఫ్ సవరణ బిల్లు, 2025 (ఉమీద్ బిల్లు)కు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోద ముద్ర వేశారు. మరోవైపు బిల్లు రాజ్యాంగ బద్ధతపై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. అసోసియేషన్ ఫర్ ది ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ అనే ఎన్జీఓ శనివారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ బిల్లు రాజ్యాంగంలోని 14, 25, 26, 300ఏ అధికరణల ప్రత్యక్ష అతిక్రమణగా ఆ సంస్థ అభివర్ణించింది. ముస్లిం మత వ్యవహారాలలో జోక్యం చేసుకోవడమేనని అదీల్ అహ్మద్ ద్వారా దాఖలైన పిటిషన్ పేర్కొంది. ఆప్ ఎమ్మెల్యే అమానుతుల్లా ఖాన్ కూడా రాజ్యాంగ బద్ధతపై పిటిషన్ దాఖలు చేశారు.

### రోదసి చెత్తతో ప్రయోగాలకు ముప్పు

న్యూఢిల్లీ: ప్రపంచ దేశాల అంతరిక్ష ప్రయోగాల వల్ల రోదసిలో చెత్త సమస్య తీవ్రతరమవుతున్నది. భూమండలానికి ప్రమాదకరంగా మారుతున్నది. మానవుడు తయారు చేసిన ఎలక్ట్రానిక్ తదితర వస్తువులు అంతరిక్షంలో ముక్కలైపోయి, వాడటానికి పనికిరాకుండా భూ కక్ష్యలో పోగు పడుతున్నాయి. ఈ వ్యర్థాల వల్ల రోదసి మిషన్స్‌కు ముప్పు ఏర్పడుతుందని తాజాగా వెలువడిన అంతరిక్ష పర్యావరణ నివేదిక-2024 వెల్లడించింది. 40 వేల వస్తువులు రోదసిలో చెత్తగా పేరుకుపోయి ఉన్నాయి. వీటి వల్ల పర్యావరణం దెబ్బతినడం, ఉపగ్రహాలు, వ్యోమ నౌకలను ఢీకొట్టడం వంటివి జరుగుతాయి.

## పెట్రో ధరలు తగ్గవా?

- అంతర్జాతీయంగా భారీగా పతనమైనా సామాన్యుడిపై కనికరం చూపని కేంద్రం



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గుతున్నప్పటికీ దేశీయంగా పెట్రోల్, డీజిల్ తదితర పెట్రోలియం ఉత్పత్తుల ధరలను తగ్గించేందుకు బీజేపీ సారథ్యంలోని కేంద్రం ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. గడచిన నాలుగేండ్లలో మొట్టమొదటిసారి బ్యారెల్ ముడి చమురు ధర 65 డాలర్లకు(రూ. 5,560) పడిపోయింది. అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్‌కు మించి సరఫరా జరగడం వల్ల రోజురోజుకూ ముడి చమురు ధరలు తగ్గుతున్నాయి. గతంలోనూ అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గినప్పటికీ భారత్‌లో మాత్రం పెట్రోల్, డీజిల్ ధరలు ఏమాత్రం తగ్గలేదు. అధిక ఉత్పత్తి, రవాణా ఖర్చులు, భారీ స్థాయిలో పన్నుల కారణంగా దేశీయంగా చమురు ధరలు అధికమని నిపుణులు చెప్తున్నారు. అంతర్జాతీయ ముడి చమురు ధరలు భారీగా పతనమైనప్పటికీ భారత్‌లో మాత్రం వాటి ప్రభావం ఏమాత్రం ఉండబోదని, దేశంలో చమురు ధరలు తగ్గే అవకాశం లేదని వారు స్పష్టం చేస్తున్నారు. ప్రపంచ ముడి చమురు ధరల పతనం భారత్‌కు శుభసూచకమని నిపుణులు చెప్పారు. అయితే కేంద్ర ప్రభుత్వ పన్ను విధానం, చమురు కంపెనీల లాభాల శాతంపైనే పెట్రోల్, డీజిల్ ధరల పెంపు, తగ్గింపు ఆధారపడి ఉంటాయి.


## ప్రతీకార సుంకాల ప్రభావంపై చర్చలు

### ఎగుమతిదారుల రక్షణకు కేంద్రం ప్రయత్నాలు

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన కొత్త సుంకాల ప్రభావం భారతదేశ ఎగుమతులపై ఏ రకంగా ఉంటుందన్న విషయమై కేంద్ర ప్రభుత్వం అధ్యయనం చేస్తోందని, త్వరలోనే అమెరికాతో ఖరారయ్యే ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కింద పన్ను తగ్గింపులతో సహా తీసుకోవాల్సిన అన్ని చర్యలను పరిశీలిస్తోందని ప్రభుత్వ వర్గాలు శనివారం వెల్లడించాయి. భారతీయ వస్తువులపై అమెరికా విధించిన ప్రతీకార సుంకాలపై ప్రభుత్వం సవివరంగా సమీక్ష జరుపుతోందని, ఎగుమతుదారులను పరిరక్షించి ఎగుమతులు నిరాటంకంగా కొనసాగేందుకు అవసరమైన అన్ని అవకాశాలను పరిశీలిస్తోందని వారు చెప్పారు. ఇతర దేశాల తరహాలో భారత్‌పై సుంకాల ప్రభావం లేదని వారు తెలిపారు. కొత్త వాణిజ్య బంధాలను ఏర్పరుచుకునేందుకు ఇప్పటికే భారత అధికారులు కొన్ని దేశాలతో చర్చలు ప్రారంభించారని వారు చెప్పారు. అయితే అమెరికా సుంకాలను ఎదుర్కొంటున్న దేశాల నుంచి అదనంగా సరుకులు భారతీయ మార్కెట్లలోకి వచ్చి పడే ప్రమాదం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు.

## ఐదేండ్లలో కోడింగ్ అంతా ఏఐ తోనే!

- అత్యంత రొటీన్, లైన్ బై లైన్ కోడింగ్‌కు మనుషులు అక్కర్లేదు
- సృజనాత్మక పరిష్కారాలకు మానవ డెవలపర్లు తప్పనిసరి
- మైక్రోసాఫ్ట్ సీటీవో కెవిన్ స్కాట్



న్యూఢిల్లీ: రానున్న ఐదేండ్లలో మొత్తం కోడింగ్‌లో 95 శాతం కృత్రిమ మేధ (ఏఐ) రాసినదే అవుతుందని మైక్రోసాఫ్ట్ సీటీఓ కెవిన్ స్కాట్ చెప్పారు. అత్యంత రొటీన్, లైన్-బై-లైన్ కోడింగ్ ఇక మాన్యువల్‌గా జరగదన్నారు. సంక్లిష్టమైన ఇంజినీరింగ్ సమస్యల పరిష్కారానికి, క్రియేటివ్ సొల్యూషన్స్‌ను రూపొందించడానికి మాత్రం హ్యూమన్ డెవలపర్స్ తప్పనిసరి అని ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో ఆయన తెలిపారు. ఏఐ అనేది డెవలపర్లకు ప్రత్యామ్నాయం కాదని, అది వారిని మరింత వృద్ధి చేస్తుందని స్కాట్ చెప్పారు. ఏఐ టూల్స్ వల్ల నాన్ టెక్ యూజర్లు సైతం అప్లికేషన్లు, వెబ్‌సైట్లను తయారు చేసుకోవడానికి అవకాశం వస్తుందన్నారు. అనుభవజ్ఞులైన ప్రోగ్రామర్లకు ఏఐ ఓ ఫోర్స్ మల్టిప్లయర్‌గా పని చేస్తుందని చెప్పారు. ప్రోగ్రామర్ల పనితీరు, సమర్థత, వేగం, విస్తృతిలను పెంచుతుందన్నారు.ఏఐ ప్రతి ఒక్కరి స్థాయిని పెంచుతుందని, డెవలపర్లు భవిష్యత్తులో బాయిలర్ ప్లేట్ కోడ్ కన్నా ఇన్నోవేషన్‌పై మరింత ఎక్కువ దృష్టి సారిస్తారని చెప్పారు. ప్రపంచంలో అత్యంత కఠినమైన కంప్యుటేషనల్ సమస్యలను పరిష్కరించాలంటే, కంప్యూటర్ సైంటిస్ట్‌ల అవసరం ఉంటుందన్నారు. ప్రారంభ అభివృద్ధి దశలలో యూఐ/యూఎక్స్, క్యూఏ వంటి ఇంటర్మీడియరీ రోల్స్ అవసరాన్ని తగ్గిస్తుందని చెప్పారు.